

అభివృద్ధికి పాటుపడదాం

మహాత్ముడి కలలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. 10లో▸



పట్టుబడిన మద్యం ధ్వంసం

వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలను బుధవారం ఆమనగల్లు పోలీసులు ధ్వంసం చేశారు. 10లో▸



మత మార్పిడికి..

మతమార్పిడిలకు పాల్పడాలని చూస్తే సహించేదిలేదని హిందూ వాహిని నేతలు హెచ్చరించారు. 10లో▸

న్యూస్‌రీల్

‘108’ సిబ్బందికి సన్మానం



చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌తో 108 సిబ్బంది

మొయినాబాద్: 108 అంబులెన్స్ సేవలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని చిలుకూరు బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్ అన్నారు. బుధవారం బాలాజీ ఆలయం వద్ద విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో 108 సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో రాత్రి, పగలు తేడా లేకుండా ఫోన్ కాల్స్ వచ్చిన వెంటనే మంచి సేవలందిస్తున్నారన్నారు. ప్రజలకు సేవ చేసే సిబ్బందిని సన్మానించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు నర్సింహాచారి, రవీందర్ చారి, శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పనిచేసిన వారికే పదవులు

ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలరావు



వేణుగోపాలరావుకు వినతిపత్రం అందజేస్తున్న వైదిక బ్రాహ్మణ సంఘం

హుడాకాంప్లెక్స్: కష్టకాలంలో పార్టీకి అండగా ఉంటూ పనిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావు అన్నారు. బుధవారం తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బ్రహ్మశ్రీ మురుకుంట రాజేశ్వరశర్మ, ప్రధాన కార్యదర్శి రుద్రవీణ బాలసుబ్రమణ్యం, వక్కలంక శ్రీనివాసరావు వేణుగోపాలరావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వక్కలంక శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు పనిచేసిన వారికే బ్రాహ్మణ సంక్షేమ పరిషత్, తెలంగాణ బ్రాహ్మణ కార్పొరేషన్‌లో పదవులు ఇవ్వాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన వేణుగోపాలరావు సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారన్నారు.

విహార యాత్రలో విషాదం

- ట్రెక్కింగ్ చేస్తుండగా వైద్యుడికి గుండెపోటు
- మనాలీలో ప్రాణం విడిచిన డాక్టర్ లాల్‌కుమార్



లాల్‌కుమార్ (ఫైల్)

షాద్‌నగర్: మిత్రులతో కలిసి సరదాగా విహార యాత్రకు వెళ్లిన వైద్యుడు ట్రెక్కింగ్ చేస్తూ గుండెపోటుకు గురై ప్రాణాలు విడిచాడు. ఈ ఘటన బుధవారం ఉదయం హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా వైరాకు చెందిన డాక్టర్ లాల్‌కుమార్ (52) కొన్నేళ్ల క్రితం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. భార్య, పిల్లలతో పట్టణంలోని సీఎస్‌కే విల్లాలో నివాసం ఉంటున్నారు. అంతకు ముందు పరిగిలో మాగ్నా ఆస్పత్రిని ఏర్పాటు చేసి, అనస్థీషియన్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్‌గా కొనసాగారు. ఇదిలా ఉండగా తనతో పాటు మెడిసిన్ చదివిన మిత్రులతో కలిసి గత నెల 28న హిమాచల్‌ప్రదేశ్ వెళ్లారు. టూర్‌లో భాగంగా బుధవారం ఉదయం మనాలీ చేరుకున్నారు. ఇక్కడి కొండ ప్రాంతాలపై ట్రెక్కింగ్ చేస్తూ గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. లాల్‌కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని గురువారం మనాలీ నుంచి షాద్‌నగర్ తీసుకురానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పూల ధరలకు రెక్కలు

సాక్షి, సిటీబ్యూరో: ఒక వైపు బతుకమ్మ వేడుకలు...మరో వైపు దేవీనవరాత్రులు..వెరసి పూలు, గుమ్మడికాయ ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా పూల ధరలు అమాంతం పెంచేశారు. గుడిమల్కాపూర్ మార్కెట్‌లో బంతి హోల్ సేల్ ధర కేజీ రూ.70–80 పలుకుతుండగా, చామంతి, గులాబీ రూ.100 నుంచి 120 పలుకుతోంది. అదే బహిరంగ మార్కెట్లో బంతి రూ.100–120 పలుకుతుండగా, చామంతి, గులాబి కేజీ ధర రూ.250 నుంచి రూ.300 పలుకుతోంది. ఇక మంచి మంచి గుమ్మడితో పాటు బూడిద గుమ్మడి కాయ సైజును బట్టి ధర రూ.150 నుంచి రూ.200 ఉంది. బతుకమ్మలను పేర్చేందుకు మహిళలు పెద్ద ఎత్తున పూలు కొనుగోలు చేస్తుంటారు. దేవీ నవరాత్రుల్లో భాగంగా ఆయుధ పూజలు చేయడం ఆనవాయితీ. పూలు, పండ్లు, కొబ్బరి కాయలు, గుమ్మడి కాయలు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తుంటారు. దీంతో డిమాండ్ పెరిగి వ్యాపారులు ధరలు పెంచేశారు.



మొండిగౌరెల్లి గ్రామంలోని సర్వే నంబరు 127లోని ప్రభుత్వ భూమి

భూ బ్యాంకు సిద్ధం

కలెక్టర్ ఆదేశాల మేరకు సర్కార్ భూముల సర్వే

- 50 ఎకరాలకు పైగా ఉన్న సర్వేనంబర్లను గుర్తించిన అధికారులు
- ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక పంపిన తహసీల్దార్
- పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం సన్నద్ధం

యాచారం: మహానగరానికి కూత వేటు దూరంలో ఉన్న యాచారం మండల ప్రభుత్వ భూములపై సర్కార్ దృష్టి సారించింది. అభివృద్ధికి అవసరమైనప్పుడు ప్రభుత్వం అడిగిన వెంటనే భూములు అప్పగించేందుకు భూ బ్యాంక్ సిద్ధం చేశారు. ఫ్యూచర్ సిటీకి అతి చేరువలో, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలో, సాగర్ హైవే పక్కనే ఉన్న యాచారం మండలంలో ఉన్న ప్రభుత్వ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు రేవంత్ సర్కార్ యత్నిస్తోంది. ఈ క్రమంలో కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి సూచనతో యాచారం తహసీల్దార్ అయ్యప్ప ప్రభుత్వ భూముల వివరాలు సేకరించారు. మెరుగైన రవాణా సౌకర్యం ఉండడంతో పారిశ్రామిక వేత్తలు అడిగిన వెంటనే భూములు ఇచ్చేందుకు ఈ భూ బ్యాంకును సిద్ధం చేసి ఉంచారు. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాసిటీ పేరిట గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 5వేల ఎకరాలకు పైగా భూములను సేకరించింది. ఆ గ్రామాల పక్కనే ఉన్న నస్దిక్‌సింగారం, నందివనపర్తి గ్రామాల్లో ఓంకారేశ్వరాలయానికి చెందిన 1,100 ఎకరాల భూముల కోసం టీజీఐఐసీని ప్రభుత్వం కోరింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి అభ్యంతరం లేకపోవడంతో కౌలు రైతులు కోర్టు మెట్లు ఎక్కారు. దీంతో కోర్టు స్టే విధించింది.

మైనింగ్ పరిధిలోకి యాచారం భూములు

అధికారులు మండల పరిధిలోని మొండిగౌరెల్లి, చింతపట్ల, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, మాల్ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ భూములను భూ బ్యాంకుకుగా గుర్తించారు. ఆయా గ్రామాల్లో 50 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములున్న సర్వేనంబర్లను గుర్తించి భూ బ్యాంకు సిద్ధం చేశారు. యాచారం ప్రభుత్వ భూముల్లో గుట్టలు, రాళ్లు, బండలు ఉండడంతో మైనింగ్ జోన్ కింద ఎంపిక చేశారు. అధికారులు సర్వే చేసిన ప్రభుత్వ భూముల్లో 30 శాతానికి పైగా భూములను పేదలకు కేటాయించి అసైన్డ్ పట్టాలిచ్చారు. వందలాది ఎకరాల్లో ప్రభుత్వ భూములకు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి కొందరు అక్రమార్కులు ధరణి పోర్టల్‌లో పేర్లు నమోదు చేయించుకున్నారు.

డ్రోన్ల సంచారంపై అనుమానం

మండల పరిధిలోని మొండిగౌరెల్లి, చింతపట్ల, నల్లవెల్లి, మా ల్, మంతన్‌గౌరెల్లి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, యాచారం గ్రామాల్లో డ్రోన్లు సంచరించాయి. వారం రోజుల పాటు నాలుగైదు డ్రోన్లు సంచరించడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. డ్రోన్ల సంచారంపై ఆయా గ్రామాల ప్రజలు పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకే డ్రోన్లతో భూ సర్వే చేసి హద్దులు గుర్తించినట్లు ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యరహిత పరిశ్రమలు, విద్య, వైద్యం, ఐటీ హబ్‌లు ఏర్పాటు చేసి ఉద్యోగావకాశాలు కల్పిస్తే ప్రజలు స్వాగతించే అవకాశం ఉంది. ఫార్మాసిటీ, మైనింగ్ జోన్, డంపింగ్ యార్డులు ఏర్పాటుకు యత్నిస్తే ఉద్యమాలు తప్పవని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

భూ బ్యాంకు వివరాలు

గ్రామం	సర్వేనంబరు	గుర్తించిన భూమి
యాచారం	121	264.27 ఎకరాలు
	126	88.24 ఎకరాలు
	132	142.11 ఎకరాలు
	146	222.22 ఎకరాలు
	200	100.26 ఎకరాలు
మొండిగౌరెల్లి	19	575.30 ఎకరాలు
	68	788.20 ఎకరాలు
	127	122.02 ఎకరాలు
చింతపట్ల	124	429.01 ఎకరాలు
	549	110.19 ఎకరాలు
	284	133.36 ఎకరాలు
నల్లవెల్లి	87	259.16 ఎకరాలు
	45	703.26 ఎకరాలు
	195	86 ఎకరాలు
	790	128.31 ఎకరాలు
మంతన్‌గౌరెల్లి	20	66.16 ఎకరాలు
	21	152 ఎకరాలు
	61	79.30 ఎకరాలు
	88	93.24 ఎకరాలు
	17	56.23 ఎకరాలు
కొత్తపల్లి	32	446.36 ఎకరాలు
	178	402.20 ఎకరాలు
	182	237.32 ఎకరాలు
	222	257.22 ఎకరాలు
	242	457.37 ఎకరాలు
	317	309.38 ఎకరాలు
	384	77.20 ఎకరాలు
తక్కళ్లపల్లి	252	70.22 ఎకరాలు
చింతుల్ల	282	349.12 ఎకరాలు

నివేదిక పంపింది నిజమే



మండల పరిధిలోని పలు గ్రామాల్లో 50 ఎకరాలకు పైగా ఉన్న ప్రభుత్వ సర్వేనంబర్ల వివరాలను గుర్తించాం. కలెక్టర్ ఆదేశాల మేరకు భూ బ్యాంకు వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రస్తుతం పరిశ్రమల ఏర్పాటు యోచన లేదు. భవిష్యత్‌లో అవకాశం ఉండొచ్చు. ఏది ఏమైనా యాచారం మండలానికి మహర్దశ పట్టనుంది.

– అయ్యప్ప, తహసీల్దార్, యాచారం



కడ్తాల్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు

పల్లె పూల సింగిడి

జిల్లా వ్యాప్తంగా బుధవారం బతుకమ్మ వేడుకలు సంబురంగా ప్రారంభమయ్యాయి. పూలను దేవతలుగా పూజిస్తూ పడుతులంతా ఒక్క చోట చేరి బతుకమ్మ ఆదారు. వారి పాటలకు కోలలు కోలాటమాడాయి. చప్పట్ల మోతకు గాజులు.. ఆటలకు కాలిగజ్జెలు ఘల్లుమన్నాయి. ఎంగిలి పూలతో ప్రారంభమైన ఈ వేడుకలు తొమ్మిది రోజులపాటు ఉత్సాహంగా కొనసాగనున్నాయి. – సాక్షి, నెట్‌వర్క్



మంచాల: ఆరుట్లలో..



కలెక్టరేట్‌లో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ తదితరులు

శాంతి మార్గమే సమస్యలకు పరిష్కారం

కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: శాంతి మార్గమే సకల సమస్యలకు పరిష్కారమని కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం గాంధీజీ చిత్రపటానికి కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్ ప్రతీమాసింగ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. జాతిపిత భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అహింస, సత్యాగ్రహంతో ముఖ్యపాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



చేనేత మగ్గాన్ని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

చేనేత వృత్తిని కాపాడుకోవాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

శ్రీనగర్‌కాలనీ: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక అయిన చేనేత వృత్తి అతి పురాతనమైనదని, చేనేత వృత్తిని మనం కాపాడుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం అమీర్‌పేట కమ్మసంఘంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'స్పెషల్ ఈవెంట్ ఎక్స్‌పో' పేరిట ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చేనేత వృత్తులు కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయని, ప్రభుత్వం చేనేత కార్మికులకు అండగా ఉంటుందని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ అందించేలా కృషిచేస్తామన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, చేనేతవృత్తి కోసం పాటుపడిన అంజయ్య సలహాలు, సూచనలు తీసుకొని చేనేతవస్త్ర పరిశ్రమను అభివృద్ధిపథంలో తీసుకువస్తామన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ చేనేత ప్రదర్శన వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ వీవర్స్ సర్వీస్ సెంటర్ హెడ్ డాక్టర్ అరుణ్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో కమ్మసంఘం ఫౌండర్ సీవీరావు, స్టేట్ హ్యాండ్లూమ్ అడిషనల్ డైరెక్టర్ వెంకటేషమ్, శ్రీజన్ సిల్క్ ఇండస్ట్రీస్ ప్రతినిధి శివకుమార్, పోచంపల్లి కోఆపరేటివ్ బ్యాంక్ ప్రెసిడెంట్ టి.రమేష్ పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసిపట్టాలి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: నగరంలోని ప్రతి ఒక్కరు తమ తమ నివాసాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, ప్రతీ వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టుకోవాల్సిన అవసరం ఉందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం.12 లోని ఐసీఐసీఐ బ్యాంకు ఎదురుగా జలమండలి అధికారులు ఏర్పాటు చేసిన ఇంజెక్షన్ బోర్‌వెల్ హార్వెస్టింగ్ పిట్(ఇంకుడు గుంత)ను ఆమె బుధవారం జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్, ఈఎన్సీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. మురుగు నీటిరహిత నగరంగా నగరాన్ని తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా జలమండలి అధికారులు నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇప్పటికే ఉన్న ఇంకుడు గుంతలను రిస్టోరేషన్ చేయాలని సూచించారు.

కాలేజీ కనిపించదే..!



మెడికల్ కళాశాల ఏర్పాటుకు వేసిన శిలాఫలకం (ఫైల్)

- మహేశ్వరం మెడికల్ కళాశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థుల్లో అయోమయం
- కాలేజీని వెతుక్కుంటూ మహేశ్వరానికి రాక
- నిరాశతో వెనుదిరుగుతున్న అభ్యర్థులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మహేశ్వరం మెడికల్ కాలేజీ విషయంలో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. కాళోజీ వర్సిటీ ఇటీవల నిర్వహించిన మెడికల్ కౌన్సెలింగ్‌లో అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు కాలేజీ, హాస్టల్ భవనాన్ని వెతుక్కుంటూ మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటకు చేరుకుంటున్నారు. తీరా అక్కడ కాలేజీ, హాస్టల్ భవనం కనిపించకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఇంతకీ తరగతులు ఎక్కడ నిర్వహిస్తారంటూ ఆరా తీస్తున్నారు. కళాశాల అడ్రస్ కౌన్సెలింగ్ వెబ్‌సైట్‌లో ఒకలా.. క్షేత్ర స్థాయిలో మరోలా ఉండటంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఇదే అంశంపై అభ్యర్థుల తల్లిదండ్రులు సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే సమాధానం లేక తల పట్టుకుంటుండం విశేషం.

అనుమతి నిరాకరణ.. ఆ తర్వాత కౌన్సెలింగ్‌కు ఒకే

జాతీయ వైద్య మండలి తెలంగాణలో ఎనిమిది కొత్త వైద్య కళాశాలలు మంజూరు చేసిన విషయం విదితమే. ఇందులో మహేశ్వరం మెడికల్ కాలేజీ ఒకటి. ఈ కలాశాల ఏర్పాటుకు ప్రభుత్వం కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట్ సర్వే నంబర్ 112లో 20 ఎకరాలు కేటాయించింది. రూ.560 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన మెడికల్ కాలేజీ భవనం, ఆస్పత్రి భవనం, వసతి గృహాలకు గతేడాది అక్టోబర్‌లో శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు అక్కడ తట్టెడు మట్టి ఎత్తలేదు. తాత్కాలిక భవనంలో తరగతులు నిర్వహించాలని నిర్ణయించి ఆ మేరకు శేరిగూడ సమీపంలోని ఐదు అంతస్తుల్లో 1.20 లక్షల చదరపు అడుగుల సామర్థ్యం ఉన్న ఓ ప్రైవేటు భవనాన్ని అద్దెకు తీసుకుంది. జాతీయ వైద్య మండలి బృందం ఈ భవనాన్ని తనిఖీ చేసింది. మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తొలుత అడ్మిషన్లకు అనుమతి నిరాకరించింది. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి హామీ లభించడంతో కౌన్సెలింగ్‌కు అనుమతి ఇచ్చింది. ఇటీవల కౌన్సెలింగ్ సైతం ప్రారంభమైంది. కన్వీనర్ కోటా కింద అడ్మిషన్ పొందిన అభ్యర్థులు తమ ప్రవేశపత్రం వెంట తీసుకుని తల్లిదండ్రులతో సహా మహేశ్వరానికి చేరుకుంటున్నారు. తీరా అక్కడ శంకుస్థాపన చేసిన శిలాఫలకం మినహాయిస్తే ఏమీ లేక పోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. నిజానికి వైద్యకళాశాల ఏర్పాటు చేయాలంటే అనువైన భవనం, అనుబంధ ఆస్పత్రి సహా ఐదేళ్లకు సరిపడు మౌలిక సదుపాయాలుండాలి. అధికారులు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా మౌలిక సదుపాయాలు లేని ఓ ప్రైవేటు భవనాన్ని ఎంపిక చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం నెలవారీ అద్దెల చెల్లింపు రూపంలో వచ్చే కమీషన్ల కోసమే అధికారులు ఇలా చేశారనే విమర్శలు లేకపోలేదు.

వనస్థలిపురంలో ప్రాక్టీస్

తొలి ఏడాది 50 సీట్లు భర్తీ చేయనుంది. శేరిగూడలో ఎంపిక చేసిన ప్రైవేటు భవనంలో తరగతులు నిర్వహించి, వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో ప్రాక్టీసు చేయించనున్నారు. ఇటీవల తాత్కాలిక ప్రాతిపదికన ఫ్యాకల్టీ, ఇతర సిబ్బంది నియామక ప్రక్రియను చేపట్టింది. 22 మంది సీనియర్ రెసిడెన్సియన్లతో పాటు ఐదుగురు డ్యూటీ డాక్టర్లు, 27 మంది టెక్నీషియన్లు, ఇతర సిబ్బందిని ఎంపిక చేసింది. తరగతులు ఒక చోట, వసతి మరో చోట.. ప్రాక్టీస్ ఇంకో చోట నిర్వహిస్తుండటంతో ఇక్కడ అడ్మిషన్ పొందేందుకు అభ్యర్థులు వెనుకాడుతున్నారు. మౌలిక సదుపాయాలు లేని కొత్త కాలేజీలో చేరి భవిష్యత్తులో ఇబ్బంది పడేకంటే.. దూరంగా ఉండడమే ఉత్తమమని భావిస్తున్నారు. ఇప్పటికే అడ్మిషన్ పొందిన వారు పునరాలోచనలో పడ్డారు. మొదటి దశ కౌన్సెలింగ్‌లో సీటు దక్కించుకున్న వారు.. రెండో దశ కౌన్సిలింగ్‌లో మరో కాలేజీని ఎంపిక చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది.

మాజీ ఎమ్మెల్యేపై కేసు

సాక్షి, సిటీబ్యూరో: పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, డెవలపర్ పురుషోత్తం నాయుడుపై ఫోర్జరీ కేసు నమోదయింది. నకిలీ పత్రాలు సృష్టించి తన సంతకాన్ని ఫోర్జరీ చేశారంటూ విజన్ రిసార్ట్స్ పార్ట్నర్ రాజశేఖర్ రావు ఆరోపించారు. ధర్మారెడ్డి తన ఇంట్లోకి చొరబడి, కుటుంబీకులను బెదిరింపులకు గురి చేశారని, సంతకాలు పెట్టకపోతే ఎట్టి తనను చంపేస్తానని హెచ్చరించారని మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు ఇరువురిపై ఫోర్జరీ కేసులు నమోదు చేసి, విచారణ చేస్తున్నారు.

మత మార్పిడికి పాల్పడితే సహించం

హిందూవాహిని నేతల హెచ్చరిక

ఇబ్రహీంపట్నం: ప్రలోభాలకు గురిచేసి, మతమార్పిడిలకు పాల్పడాలని చూస్తే సహించేదిలేదని హిందూ వాహిని నేతలు హెచ్చరించారు. పట్నంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వాహిని రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ విశ్వప్రసాద్, కో–కన్వీనర్ గురువయ్యలు మాట్లాడుతూ.. ఓ క్రిస్టియన్ మిషనరీ సంస్థ పట్నంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ విద్యార్థులను స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో ప్రలోభాలకు గురిచేసి, మత మార్పిడిలకు పాల్పడుతుందని ఆరోపించారు. విద్యాసంస్థలు, హాస్టల్స్ ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో విద్యార్థులను మచ్చిక చేసుకునేందుకు సంస్థ యత్నిస్తుందని పేర్కొన్నారు. కొన్ని కళాశాలల్లోని ఆ మతానికి చెందిన హెచ్‌ఓడీలు క్రైస్తవులుగా మారాలని, లేకుంటే ఇంటర్నల్ మార్కులు తగ్గించి ఫెయిల్ చేస్తామని విద్యార్థులను బెదరిస్తున్నట్లు ఆరోపించారు. మత మార్పిడిలకు పాల్పడుతున్న వారిని ప్రశ్నించిన కార్యకర్తలపై మిషనరీకి చెందిన వారు దాడులు చేశారని, అన్ని ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కార్యకర్తల పైనే తప్పుడు కేసులు పెట్టాలని పట్నం పోలీసులపై మిషనరీ సంస్థ ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసిందన్నారు. ఎవ్వరైనా స్వచ్ఛందంగా మతమార్పిడి చేసుకోవాలన్నా.. కొన్ని నిబంధనలు వర్తిస్తాయని పేర్కొన్నారు. దళితులు మతం మారితే వారికి ఎస్సీ రిజర్వేషన్లు వర్తించవని, బీసీ కిందకు వస్తారని తెలిపారు. దేశం కోసం, ధర్మం కోసం పనిచేసే హిందూవాహిని అక్రమ మత మార్పిడిలను తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాజ్యంగానికి, చట్టానికి వ్యతిరేకంగా ఎవరైనా ప్రలోభపెట్టి మత మార్పిడిలకు పాల్పడితే చూస్తూ ఉరుకోదని హెచ్చరించారు. సమావేశంలో వాహిని ప్రచార కమిటీ నాయకులు శ్రీనివాస్, రాములు, ఆర్‌ఎస్‌ఎస్ నగర సంఘ సంచాలకులు అంజన్‌రెడ్డి, వాహిని సభ్యులు అభిషేక్‌రెడ్డి, రోహిత్, వినయ్, శ్రీధర్, శివకుమార్ ఉన్నారు.


మాట్లాడుతున్న హిందూవాహిని నేతలు

డ్రగ్స్, గంజాయిని సమూలంగా నిర్మూలించాలి

సాక్షి,సిటీబ్యూరో: మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్న ఎక్సైజ్ శాఖ సిబ్బంది గత నెలలో భారీగా గంజాయి, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు ధూల్‌పేట్‌లో గంజాయి మూలాలను తుదిముట్టించడం, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రవాణా నియంత్రణకు తీసుకున్న చర్యలు సఫలం కావడంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్ రెడ్డి సిబ్బందిని అభినందించారు. గత నెలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చేపట్టిన చర్యలపై బుధవారం ఎక్సైజ్ భవన్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఖమ్మం, ధూల్‌పేట్ ప్రాంతాల్లో భారీగా గంజాయి పట్టుబడడం, హైదరాబాద్ మహానగరంలో పలు ప్రాంతాల్లో డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పనితీరు అభినందనీయమన్నారు.

ధూల్‌పేట్ గంజాయి దందాకు కళ్లెం

గత కొన్నేళ్లుగా గంజాయి రవాణా కేంద్రంగా ఉన్న దూల్‌పేటలో గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ఎక్సైజ్ శాఖ సిబ్బంది ప్రతి ఒక్కరు తమ వంతు పాత్ర పోషించారన్నారు. గత నెలలో దూల్ పేటలో ఎక్సైజ్ శాఖ 43 కేసులు నమోదు చేసి అందులో 134 మందిని అరెస్టు చేయడంతోపాటు 715 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నచ్చిన ఆటల్లో సత్తా చాటండి

గచ్చిబౌలి: నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే కొండాపూర్‌లోని 8వ బెటాలియన్ పోలీసులు ఆటల పోటీలతో సేదదీరారు. బెటాలియన్‌లోని ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న పోలీస్ కానిస్టేబుళ్లకు మూడు రోజులపాటు నిర్వహించిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ముగింపు కార్యక్రమం బుధవారం ముగిసింది. 8వ బెటాలియన్ కమాండెంట్ సన్నీ పర్యవేక్షణలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సన్నీ మాట్లాడుతూ.. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ స్నేహ పూరిత వాతావరణంలో జరిగాయన్నారు. నిత్యం శిక్షణలో బిజీగా ఉండే వారికి ఆటవిడుపుగా స్పోర్ట్స్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలని, తమకు నచ్చిన క్రీడల్లో సత్తా చాటాలన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బెటాలియన్ అదనపు కమాండెంట్ కె.వీరయ్య, బి.వి. రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్స్ బి.సిత్రం, పార్థసారథిరెడ్డి, ఎం.నాగభూషణం, బి.రాంబాబు, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు



ఇద్దరు దొంగల అరెస్టు

ఇబ్రహీంపట్నం రూరల్: సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఏటీఎంలలో డబ్బులు చోరి చేయడానికి యత్నించిన దొంగలను ఆదిబట్ల పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిబట్ల ఠాణా పరిధి నాదర్‌గుల్‌లో నివాసం ఉండే అజీమ్‌పాషా, అర్బాజ్ కురేసిలు ఇద్దరు బంధువులు. 15 రోజుల క్రితం ఇద్దరూ నాదర్‌గుల్‌లో కల్లు కంపౌండ్‌లో కల్లు తాగారు. అనంతరం ఏటీఎంలో చోరీకి యత్నించారు. గమనించిన పోలీసులు నిందితులిద్దరినీ పట్టుకున్నారు. వారి నుంచి బైక్, సుత్తి, సానం, ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి దొంగతనం జరగలేదని పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న..

మీర్‌పేట: ఇద్దరు గంజాయి విక్రేతలను మీర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నందనవనంకు చెందిన ఆటో డ్రైవర్ మనీష్ సింగ్(48), కూలీ పనులు చేసే మహమ్మద్ ఖలీల్(30)లు కొంత కాలంగా మంగళ్‌హాట్ సీతారాంపేటకు చెందిన ఆబేద్ బిన్‌ఖాలిద్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి, స్థానికంగా విక్రయిస్తున్నారు. బుధవారం గాయత్రినగర్ వద్ద మనీష్ సింగ్, ఖలీల్‌లు గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు.. వారిని అరెస్ట్ చేసి, 1300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరిని రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు ఆబేద్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు.

కూకట్‌పల్లిలో..

సాక్షి,సిటీబ్యూరో: వ్యాపారంలో భారీగా నష్టాలు రావడంతో వాటిని పూడ్చుకునేందుకు డ్రగ్స్, గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కూకట్‌పల్లి గాయత్రినగర్ శ్రీచైతన్య జూనియర్ కళాశాల వెనుక ఓ ఇంట్లో గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్టీఎఫ్‌డీ.. బుధవారం రుషికేశ్వర్ రావు ఇంట్లో సోదాలు నిర్వహించారు. 7 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, 185 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఏఈపీకి చెందిన రుషికేశ్వర రావు.. వ్యాపారంలో వచ్చిన నష్టాల నుంచి గట్టెక్కేందుకు గంజాయి అమ్మకాలు చేపడుతున్నట్లు విచారణలో వెల్లడయ్యింది.

సర్వపాప హరణం | దుర్గమ్మ దర్శనం

నేడు కొలువుదీరనున్న అమ్మవారు

షాబాద్: అమ్మలగన్న అమ్మ.. దుర్గమ్మ. లోక కల్యాణం కోసం అపరకాళికగా మారి మహిషాసురుడిని వధించింది. శిష్ట రక్షణ కోసం దుష్ట శిక్షణ తప్పదని, ఎప్పటికైనా చెడుపై మంచిదే గెలుపని నిరూపించింది. సకల జగత్తుకు మూలం, త్రిమూర్తులకు శక్తి ప్రదాత, త్రిలోకేశ్వరి సకలాభీష్ట ప్రదాయిని, దుర్గామాత దుష్ట శిక్షణ గావించిన రోజున విజయ దశమిని నిర్వహించుకుంటాం. అందులో భాగంగా గురువారం దేవీ నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. మండల పరిధి వివిధ గ్రామాల ఆలయాల్లో దుర్గమ్మ ప్రతిమలను ప్రతిష్ఠించనున్నారు. ఇందుకోసం యువజన సంఘాలు, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మంటపాలు సిద్ధమయ్యాయి. గురువారం సాయంత్రం అమ్మవారు తొలి పూజలు అందుకోనున్నారు.

శైలపుత్రి

చైతన్య శక్తి శైలపుత్రి, త్రిమూర్తి స్వరూపిణి, ఆది పరాశక్తి సతీదేవిగా యోగాగ్నిలో తనువు చాలించింది. తిరిగి పర్వత రాజు హిమవంతునికి శైలపుత్రిదేవిగా జన్మించింది. నంది వాహనంపై త్రిశూల ధారిణిగా స్త్రీ శక్తిని లోకానికి తెలియజేసింది.

బ్రహ్మచారిణి

బ్రహ్మచారిణిగా నియమ నిష్ఠలతో తపస్సు చేసి శివుడిని వరించింది. చేతిలో కమండలంతో మాల ధారిణిగా నిత్యం తపో ముద్రాంకితగా దర్శనమిచ్చింది. ఈ రూపంలోని దుర్గామాతను ఆరాధించిన వారికి ఏకాగ్రత దీక్ష అలవడుతుంది.

చంద్రఘంటాదేవి

మనసుకు మార్గదర్శి చంద్రఘంటాదేవి. ఈ రూపంలో అమ్మవారిని ఆరాధించే వారికి శాంతి, సౌభాగ్యాలు కలుగుతాయని ప్రతీతి.

కుష్మాండదుర్గ

శారీరక, మానసిక రుగ్మతలను పారదోలే రూపం కుష్మాండదుర్గ. వర, అంకుశ, పాశ, అభయ ముద్రలతో కూడిన అష్ట భుజాలతో కోటి సూర్య ప్రభలతో ప్రకాశించే జనని అభయ ప్రదాయిని.

స్కంధమాత

మాతృదేవోభవ అనే సందేశాన్ని, అమ్మతత్వాన్ని మానవాళికి ప్రభోదంగా, ఆదిమాతగా కుమార స్వామిని లాలించే అమృత రూపంలో వెలుగొందే దివ్యమూర్తిగా అమ్మవారు దర్శనమిస్తారు.

కాత్యాయణిదేవి

సకల సంసార బంధాలకు కారకురాలు, భవసాగరాల నుంచి మానవుల్ని ఉద్దరించే శక్తిరూపిణి అయిన అమ్మవారు సింహవాహనం అధిరోహించి, కరవాలం చేబూని రాక్షసత్వాన్ని పారదోలే జగద్రక్షిణిగా శోభిల్లుతుంది.

కాళరాత్రి

ప్రాణకోటి జీవుల్లో గ్రహబాధలు తొలగించి మృత్యువుకే భయం కలిగిస్తూ దుర్గుణాలు, దుష్టశక్తులను పారదోలి, సత్యకర్మల్ని ప్రేరేపిస్తూ మంచి బుద్ధిని పెంచుతుంది.

మహాగౌరి

ఆదిపరాశక్తిగా భయంకర కాళ స్వరూపాన్ని విసర్జించిన అమ్మవారు.. ధవళకాంతితో వెలిగిపోయే మంగళస్వరూపిణిగా మహాగౌరి అవతరించింది. తెల్లని వస్త్రాలు ధరించి, త్రిశూలం చేబూని శతకోటి దివ్య కాంతుల్ని భక్తజనకోటికి అభయ ప్రదానం చేస్తూ శోభిల్లుతుంది.

సిద్ధిధాత్రి

మోక్ష ప్రదాత్రి సిద్ధిధాత్రి. భౌతిక జీవనంలో సర్వ సిద్ధులు అనుగ్రహించే సిద్ధిధాత్రి అష్ట సిద్ధులను, మోక్షమును ప్రసాదిస్తుంది.

అపరాజిత

అపరాజిత శ్రీరాజేశ్వరిదేవి. సర్వమానవ జీవితాల్లో సర్వశక్తికి కేంద్రస్థానం జగజ్జననే. శరన్నవరాత్రుల్లో అమ్మవారికి విశేష అలంకారాలు ముగిశాక విజయ దశమి రోజు రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిస్తుంది.



అవతారాలు

అశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి ప్రారంభమయ్యే నవరాత్రుల్లో తొలిరోజు అమ్మ వారికి కలశ స్థాపన చేసి ప్రతిష్ఠిస్తారు. అప్పటి నుంచి దసరా వరకు శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంటా, కూష్మాండ, స్కంధమాత, కాత్యాయణి, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి అవతారాల్లో అమ్మవారిని భక్తులు కొలుస్తారు.

ప్రీతిపాత్రమైన రోజులు

రుద్ర రూపిణి భద్రకాళిగా ఎనిమిదో రోజు జన్మించిన చాముండి.. తొమ్మిదో రోజు వీరవిహారం చేసి, దైత్య సంహారం చేసిందని పురాణాలు చెబుతున్నాయి. పదో రోజు విజయలక్ష్మిగా జనుల ఆనందోత్సవాలకు ప్రతీకగా పూజలందుకుంటుంది. నవరాత్రుల్లో చివరి మూడు రోజులు అత్యంత ప్రీతి పాత్రమైనవి. వీటినే మనం దుర్గాష్టమి, మహార్నవమి, విజ యదశమి పేరిట ఉత్సవాలు జరుపుకొంటున్నాం.

పట్టుబడిన మద్యం ధ్వంసం

ఆమనగల్లు: వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం సీసాలను బుధవారం పోలీసులు ధ్వంసం చేశారు. ఆమనగల్లు ఠాణా పరిధి సుమారు 10 ఎక్సైజ్ కేసుల్లో రూ.42 వేల విలువైన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టుబడిన మద్యం బాటిళ్లను ఎస్‌ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో పోలీసులు, మున్సిపల్ సిబ్బంది కలిసి ధ్వంసం చేశారు.


మద్యం బాటిళ్లను ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఊరెళ్తున్నారా.. పీఎస్‌లో సమాచారం ఇవ్వండి

- సీఐ కాంతారెడ్డి



షాబాద్: దసరా పండుగకు సొంతూర్లకు వెళ్తున్నవారు జాగ్రత్తగా ఉండాలని, దొంగతనాల నివారణకు తప్పనిసరిగా పోలీసుల సూచనలు, సలహాలు పాటించాలని సీఐ యాదయ్యగౌడ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఊరికి వెళ్తున్నవారు తొలుత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. డబ్బు, బంగారు ఆభరణాలు, విలువైన పత్రాలను బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలని సూచించారు. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్‌ను అమర్చుకోవాలని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని పేర్కొన్నారు. అదే సమయంలో ఇరుగు పొరుగు వారికి.. కూడా సమాచారం ఇస్తే బాగుంటుందని తెలిపారు. మీ ఇంటికి వచ్చే, వెళ్లే దారులు, ఇంటి లోపల సీసీలను అమర్చుకుని, డీవీఆర్ కనపడకుండా రహస్య ప్రాంతంలో ఉంచాలని వివరించారు.

స్నేహితుడే హంతకుడా?

- యువతి హత్య కేసులో వీడని మిస్టరీ
- దర్యాప్తు చేస్తున్న మియాపూర్ పోలీసులు

మియాపూర్: మియాపూర్ దీప్తిశ్రీనగర్ కాలనీలో సోమవారం జరిగిన హత్యకేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. దీప్తిశ్రీనగర్ కాలనీ, సీబీఆర్ ఎస్టేట్‌లో బండి స్పందన అనే యువతి దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. స్పందన తల్లి నమ్రత, సోదరుడితో కలిసి సీబీఆర్ ఎస్టేట్‌లోని ఫ్లాట్ నంబర్ 110 ఉంటోంది. స్పందన కూకట్‌పల్లిలోని ప్రైవేటు కళాశాలలో చదువుకుంటున్న సమయంలో వినయ్‌కుమార్ అనే యువకుడిని ప్రేమించి పెద్దలను ఒప్పించి వివాహం చేసుకుంది. పెళ్లైన కొద్ది రోజులకు వారి మధ్య విభేదాలు తలెత్తడంతో వేర్వేరుగా ఉంటున్నారు. స్పందన వినయ్ కుమార్‌ను పెళ్లి చేసుకోకముందునుండే అదే కళాశాలకు చెందిన మనోజ్ అనే యువకుడు ఆమెను ప్రేమించాడు. అయితే స్పందన వినయ్ వేరుగా ఉంటున్నట్లు తెలియడంతో అతను స్పందనకు దగ్గరై ప్రతిరోజు ఆమె ఇంటికి వచ్చి వెళ్లేవాడని సమాచారం. ఈ క్రమంలోనే అతను పెళ్లి చేసుకుంటానని వేధిస్తుండటంతో ఆమె అతడిని దూరం పెట్టింది. దీంతో ఆగ్రహానికి లోనైన మనోజ్ సోమవారం ఉదయం తన వెంట తెచ్చుకున్న టూల్ కిట్‌లోని సుత్తితో స్పందన తలపై మోది ముఖంపై స్క్రూ డ్రైవర్‌తో విచక్షణ రహితంగా పొడిచి హత్యచేసినట్లు సమాచారం. అపార్ట్‌మెంట్, కాలనీలోని సీసీ కెమెరాల ఫుటేజీ, ఫోన్ కాల్స్ ఆధారంగా మియాపూర్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

బాలుడిపై వీధి కుక్కదాడి


గాయపడిన జశ్వంత్

దుండిగల్: వీధి కుక్క ఏడేళ్ల బాలుడిపై దాడి చేసిన సంఘటన బుధవారం దుండిగల్ మున్సిపాలిటీ, బౌరంపేట్‌లో చోటు చేసుకుంది. బౌరంపేట్‌కు చెందిన జేమ్స్ మేస్త్రీగా పని చేస్తున్నాడు. అతని కుమారుడు జశ్వంత్(07) స్థానిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం అతను కిరాణ దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా వీధి కుక్క అతడి దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు అతడిని నారాయణగూడ ఆస్పత్రికి తరలించారు. దీనిపై సమాచారం అందడంతో దుండిగల్ కమిషనర్ సత్యనారాయణ వెంటనే అక్కడికి చేరుకుని బాలుడిని పరామర్శించారు. బ్లూ క్రాస్, మున్సిపల్ సిబ్బందితో కుక్కలను పట్టించారు.

రాచకొండలోనూ డీజేలపై నిషేధం

- నిబంధనలను ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు
- కమిషనర్ సుధీర్ బాబు ఉత్తర్వులు జారీ

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనూ మతపరమైన ఊరేగింపుల్లో డీజే సౌండ్ సిస్టమ్ వినియోగంపై నిషేధం విధిస్తూ పోలీస్ కమిషనర్ జీ సుధీర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. డీజేల నుంచి అధిక డెసిబెల్స్‌తో ఉత్పన్నమయ్యే శబ్దాల కారణంగా హృద్రోగులకు గుండెపోటు, ఇతర హృదయ సంబంధ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉండడంతో పాటు చిన్నపిల్లలకు శాశ్వత వినికిడి సంబంధ సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ఇకపై రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఊరేగింపుల్లో డీజే సౌండ్ మిక్సర్లు, యాంప్లిఫయర్, బాణాసంచా ఉపయోగించడాన్ని నిషేధిస్తూ సీపీ కీలక నిర్ణయం తీసుకున్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై బీఎన్‌ఎస్ 223, 280, 292, 293, 324, బీఎన్‌ఎస్‌ఎస్ 152, పర్యావరణ పరిరక్షణ చట్టం–సెక్షన్ 15 కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుందని తెలిపారు. ఈ ఉత్తర్వులు పూర్తి స్థాయిలో అమలు చేయాలని రాచకొండ పరిధిలోని అన్ని జోన్ల అధికారులకు సీపీ ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: పరీక్షల ఒత్తిడితో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన నవీన్‌కుమార్ కుమారుడు రాహుల్‌రాజు(22) లా చదువుతున్నాడు. కళాశాలలో పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైన రాహుల్‌రాజు బుధవారం బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


రాహుల్‌రాజు మృతదేహం

పల్లెల అభివృద్ధికి పాటుపడదాం

- మహాత్ముడి కలలను సాకారం చేద్దాం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- మండల కేంద్రంలో పీహెచ్‌సీ, పాలిటెక్నిక్ ఏర్పాటుకు హామీ

కడ్తాల్: దేశానికి పల్లెలు పట్టుగొమ్మలు అన్న మహాత్ముడి కలలను సాకారం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అందుకు గ్రామాల అభివృద్ధికి సమష్టిగా పాటుపడాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కేంద్ర పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో దేశంలోని 750 ఆదర్శ గ్రామాల్లో, కడ్తాల్ కూడా ఎంపికై ందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రామ పెద్దలను సన్మానించినట్లు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ సుజాత నాయక్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పూర్వ ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామాభివృద్ధి కోసం తమ అభిప్రాయాలు వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ కడ్తాల్ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ప్రజల కోరిక మేరకు కడ్తాల్ మండల కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, ట్రామాకేర్ సెంటర్, జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

ఫ్యూచర్ సిటీతో ఉపాధి అవకాశాలు

గ్రామ సమీపంలోనే ఫ్యూచర్‌సిటీ, ఫోర్త్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు ఏర్పాటు కానుండటంతో మండలానికి మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే తెలిపారు. తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతానన్నారు. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక అధికారిణి పద్మకౌశిక్ మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి పాటుపడుతున్న స్థానిక ప్రజల చైతన్యాన్ని అభినందించారు. గ్రామంలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీఇచ్చారు. అంతకు ముందు పవర్ పాయింట్ ప్రజంటేషన్, షార్ట్ ఫిల్మ్ ద్వారా జీపీ అభివృద్ధి ప్రణాళికలు(జీపీడీపీ)పై వివరించడంతో పాటు, ఆరోగ్య, విద్య, పారిశుద్ధ్యం, ఉపాధిరంగాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై వివరించారు. కార్యక్రమంలో 75 ఏళ్ల నిండిన సీనియర్ సిటీజన్స్‌ను, మాజీ ప్రజాప్రతినిధులను సన్మానించారు. ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఏక్‌పేడ్ మాకే నామ్‌లో భాగంగా ఆలయ పరిసరాల్లో 75 మొక్కలు నాటారు. కార్యక్రమంలో కన్సల్టంట్ వరుణ్ తివారి, రిసర్చ్ డాక్టర్ కన్నయ్య, అధికారులు నిధిసింగ్, విద్యులత, తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్ కార్యాలయ ప్రధాన అధికారి అనిల్‌కుమార్, పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, డీఎల్‌పీఓ లక్ష్మీనారాయణ, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ ఎల్‌ఎన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు నాయకులు జంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, లింగం, దీపికారెడ్డి, ఆంజనేయులు, నర్సింహ, భిక్షపతి, మహేశ్, ఏపీఎం రాజేశ్వరి తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి